AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

www.aksharatoday.in




## ఎల్లారెడ్డి మండల సర్పంచుల ఫోరం కార్యవర్గం


**అక్షరటుడే,ఎల్లారెడ్డి:** ఎల్లారెడ్డి మండల సర్పంచుల ఫోరం నూతన కార్యవర్గ ఎన్నికలు శనివారం నిర్వహించారు. మండలంలోని సర్పంచు లందరూ పాల్గొని కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్ని కల్లో గౌరవ అధ్యక్షురాలిగా దుద్దుల వనిత సాయిరాం, అధ్యక్షురాలిగా ప్రియాంక గణేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.


19-4-2026 NIZAMABAD / KAMAREDDY PAGES - 2




## సొసైటీ కార్యాలయానికి తాళం వేసి రైతుల నిరసన

**అక్షరటుడే, బాన్సువాడ:** బీర్కూర్ మండలంలోని బైరాపూర్ గ్రామంలో రైతులు ఆదివారం ఆందోళనకు దిగారు. సొసైటీ పరిధిలో ధాన్యానికి కాంటాలు వేయడం లేదని, ఇతర గ్రామాలకే ప్రాధాన్యం ఇస్తున్నారంటూ ఆరోపించారు. ఆగ్రహానికి లోనైన రైతులు సొసైటీ కార్యాలయానికి తాళం వేసి నిరసన వ్యక్తం చేశారు. గత వారం రోజులుగా సొసైటీ కార్యదర్శి విధులకు హాజరు కాకపోవడంతో పాటు, ఫోన్ చేసినా స్పందించడం లేదని రైతులు తెలిపారు. ప్రస్తుతం వర్ష సూచనల నేపథ్యంలో, వాన పడితే కోసిన పంట తడిసిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల 4న కోసిన వడ్లకు ఇప్పటివరకు కాంటాలు వేయకపోగా 18న కోసిన వడ్లకు మాత్రం వెంటనే కాంటాలు వేయడంపై రైతులు అసంతృప్తి వ్యక్తం చేశారు. రైతుల మధ్యవివక్ష చూపకుండా వెంటనే చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. సమస్యను తక్షణమే పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహిస్తామని హెచ్చరించారు.





మున్సిపాలిటీలలో కో ఆప్షన్ ఎన్నికకు అధికారులు సిద్ధమవుతున్నారు. ఈ నెల 22 వరకు దరఖాస్తులు తీసుకోనున్నారు. గత రెండు నెలలుగా ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న కో–ఆప్షన్ ఎన్నికకు సర్వం సిద్ధం అవుతుండగా ఆశావహుల సంఖ్య పెరిగిపోతోంది. ఎలాగైనా ఆ పదవిని దక్కించుకోవాలని పలువురు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ముఖ్య నేతలను ప్రసన్నం చేసుకుంటున్నారు. దీంతో ఆ పదవులు ఎవరికి దక్కుతాయోననే ఉత్కంఠ నెలకొంది.

- అక్షరటుడే, కామారెడ్డి

# ‘కో ఆప్షన్’ కోసం పైరవీలు

- నేతలను ప్రసన్నం చేసుకుంటున్న ఆశావహులు
- ఈ నెల 22 వరకు దరఖాస్తులు సమర్పించేందుకు అవకాశం

కామారెడ్డి, ఎల్లారెడ్డి మున్సిపాలిటీలలో కో-ఆప్షన్ సభ్యుల ఎన్నికల నిర్వహణకు కమిషనర్లు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఈ నెల 22 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. దీంతో రెండు మున్సిపాలిటీలలో రాజకీయం రసవత్తరంగా మారింది. కో-ఆప్షన్ పదవి దక్కించుకోవడానికి ఎవరి ప్రయత్నాల్లో వారు ఉన్నారు.

### ఆశావహుల జోరు

జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి మున్సిపాలిటీలలో కో-ఆప్షన్ ఎన్నికకు అధికారులు కసరత్తులు ప్రారంభించారు. ఒక్కో మున్సిపాలిటీలో నలుగురికి కో-ఆప్షన్ సభ్యులుగా అవకాశం ఇవ్వనున్నారు. అందులో ఇద్దరు మహిళలకు ఛాన్స్ దక్కనుంది. కో-ఆప్షన్ పదవి కోసం ఆశావహులు అధిక సంఖ్యలో పోటీలో ఉన్నట్టుగా తెలుస్తోంది. ముఖ్యంగా కామారెడ్డి మున్సిపాలిటీలో అత్యధిక పోటీ ఉండే అవకాశాలు ఉన్నాయి. ఇక్కడి రాజకీయం ప్రతిసారి హాట్ హాట్‌గా మారుతోంది.

### వీరికి మాత్రమే అవకాశం

మున్సిపాలిటీలలో కో-ఆప్షన్ మెంబర్లుగా ఇద్దరు మహిళలు, ఇద్దరు పురుషులకు అవకాశం ఉంది. మున్సిపాలిటీ నిబంధనల ప్రకారం ప్రత్యేక పరిజ్ఞానం, అనుభవం ఉన్నవారికి ఇద్దరికి, మైనార్టీ వర్గాల్లో ఇద్దరికి కో-ఆప్షన్ పదవి దక్కనుంది. గతంలో రాజకీయాల్లో ఐదేళ్ల అనుభవం ఉన్నవారికి, స్టాండింగ్ కౌన్సిల్ అడ్వకేట్‌గా మూడేళ్ల అనుభవం ఉన్నవారికి అవకాశం కల్పిస్తారు.

## భక్తిశ్రద్ధలతో సీతారాముల ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



**అక్షరటుడే మాక్లూర్:** గొట్టుముక్కల గ్రామంలో సీతారాముల ఆలయ ప్రతిష్ఠాపనోత్సవాలు రెండో రోజు ఘనంగా జరిగాయి. వేదంపండితుల మంత్రోచ్ఛరణలతో శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉత్సవమూర్తులను ధాన్యాది వాసం గావించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. చివరిరోజు సోమవారం హంపీ పీఠాధిపతి విద్యారణ్య భారతి చేతుల మీదుగా ప్రతిష్ఠాపన కార్యక్రమం ఉంటుందని కమిటీ సభ్యులు తెలిపారు.

## బాల్కొండ మోడల్ స్కూల్‌లో ప్రవేశ పరీక్ష




**అక్షరటుడే, బాల్కొండ:** బాల్కొండ మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో 6వ తరగతి 10 వరకు ప్రవేశాల కోసం పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం సెషన్‌లో 115 మంది విద్యార్థులకు గాను 84 మంది హాజరయ్యారు. అలాగే, మధ్యాహ్నం సెషన్‌లో 21 మందిలో 17 మంది హాజరయ్యారు. పరీక్ష కేంద్రాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ పరిశీలించారు. పరీక్ష ప్రశాంత వాతావరణంలో ఎటువంటి అంతరాయం లేకుండా సాఫీగా ముగిసిందని సెంటర్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ ప్రసాద్ తెలిపారు.

## ఎన్ఎస్‌యూఐ జాతీయ అధ్యక్షుడిని కలిసిన వేణురాజ్

**అక్షరటుడే, ఇందూరు:** తెలంగాణ పర్యటనలో భాగంగా ఎన్ఎస్‌యూఐ జాతీయ అధ్యక్షుడు వినోద్ జాకర్ హైదరాబాద్ విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయనకు ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు ఎడవెల్లి స్వామి, లీగల్ సెల్ ప్రతినిధులు అక్బర్, మనోహర్ యాదవ్, మాజీ జాతీయ కో-ఆర్డినేటర్ అనులేక, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాహుల్ యాదవ్‌తో కలిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వరద బట్టు వేణురాజ్ ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం వినోద్ జాకర్ అంబేడ్కర్ విగ్రహానికి, అనంతరం అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించారు.





## ప్రభుత్వ సలహాదారును సన్మానించిన జీజీహెచ్ ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్

**అక్షరటుడే, ఇందూరు:** జీజీహెచ్ ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్‌గా డాక్టర్ నాగమోహన్ ఇటీవల నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆదివారం ప్రభుత్వ సలహాదారు, బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్ రెడ్డిని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జీజీహెచ్‌లో రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలని సుదర్శన్ రెడ్డి సూచించారు.

## ‘బాధితుడి వైపు న్యాయం కోసం పీఎస్‌కు వెళ్తే దాడి చేశారు’

**అక్షరటుడే, కామారెడ్డి:** కామారెడ్డి పట్టణంలో ఆదివారం హైడ్రామా చోటు చేసుకుంది. ఐదేళ్ల బాలుడిని హత్య చేసిన ఘటనపై బాలుని తండ్రి నుంచి ఫిర్యాదు తీసుకోకుండా వివాహేతర సంబంధం పెట్టుకున్న వ్యక్తితో కలిసి హత్య చేసిన తల్లి బంధువుల నుంచి పోలీసులు ఫిర్యాదు తీసుకోవడంపై విమర్శలు వెల్లువెత్తాయి. ఈ ఘటనకు సంబంధించిన ఆర్గొండ సర్పంచ్ విక్రమ్ రెడ్డి వివరాలు వెల్లడించారు. హత్యకు గురైన బాలుడి తండ్రి భాస్కర్ తనకు అన్యాయం జరిగిందని తనను ఆశ్రయిస్తే బాధితుడిని తీసుకుని కామారెడ్డి పోలీస్ స్టేషన్‌కు వెళ్లానని ఆర్గొండ సర్పంచ్ విక్రమ్ రెడ్డి పేర్కొన్నారు. బాలుని తండ్రి ఫిర్యాదు తీసుకోకుండా హత్య చేసిన తల్లి తరఫు బంధువుల ఫిర్యాదు ఎలా తీసుకున్నారని, వీలైతే తండ్రి నుంచి కూడా ఫిర్యాదు తీసుకోవాలని ఇన్స్పెక్టర్‌ను కోరారన్నారు. దాంతో అక్కడే సివిల్‌లో ఉన్న ముగ్గురు కానిస్టేబుళ్లు తనపై దాడికి పాల్పడి ఫోన్ లాక్కున్నారన్నాడు. అంతటితో ఆగకుండా బాలుడిని హత్య చేసిన నిందితుల పక్కన కూర్చోబెట్టి తనను అవమానించారని సర్పంచ్ తెలిపారు. తాను ఒక సర్పంచ్ అన్న విలువ కూడా ఇవ్వకుండా దాడికి పాల్పడిన కానిస్టేబుళ్లపై చర్యలు తీసుకోవాలని వారిని సస్పెండ్ చేయాలని విక్రమ్‌రెడ్డి డిమాండ్ చేశారు. అయితే ఆర్గొండ సర్పంచ్, మండల సర్పంచ్‌ల ఫోరమ్ అధ్యక్షుడిగా ఉన్న విక్రమ్ రెడ్డికి మద్దతుగా రాజంపేట మండలంలోని ఎల్లారెడ్డి నియోజకవర్గ సర్పంచులు పోలీస్ స్టేషన్ ముందు ధర్నాకు సిద్ధమయ్యారు. బాలుని తరపున బంధువులతో కలిసి కామారెడ్డికి సర్పంచులు చేరుకోగా పోలీసు శాఖ, ఇంటలిజెన్స్ విభాగం అప్రమత్తమైంది.



సర్పంచులు, బాధితుల కోసం ఎక్కడికక్కడ నిఘా పెట్టారు. పోలీస్ స్టేషన్‌కు రాకుండా అడ్డుకట్ట వేసేలా ప్లాన్ చేయగా ఈ విషయాన్ని తెలుసుకున్న ఓ నాయకుడు సర్పంచులందరినీ తన వద్దకు పిలుచుకుని మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితుల్లో పోలీస్ స్టేషన్ ముందు ధర్నా సరికాదని, నిందితులపై సైతం కేసులు నమోదవుతాయని చెప్పడంతో ధర్నా ఆలోచన విరమించుకున్నారు. సదరు అధికారిపై చట్టపరమైన చర్యలకు ముందుకు వెళ్లాలని నిర్ణయించారు. జిల్లా ఎస్పీ, ఐజీ, డీజీపీలకు నేరుగా ఫిర్యాదు చేయాలని నిర్ణయించినట్లు సర్పంచులు పేర్కొన్నారు. దాంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు కామారెడ్డిలో హైడ్రామా నెలకొంది.

### సర్పంచ్ పై దాడి జరగలేదు



ఆర్గొండ సర్పంచ్ పై దాడి విషయం అబద్ధం. ఒక సర్పంచ్‌ను ఎవరైనా కొడతారా.. ఆయనను ఎవరూ కొట్టలేదు. ఆయనే పోలీస్ స్టేషన్లో న్యూసెన్స్ చేశారు. అయినా ఆయనకు ఇవ్వాల్సిన గౌరవ మర్యాదలు ఇచ్చాం. – నరహరి, సీఐ

## మహిళా రిజర్వేషన్లను నియోజకవర్గాల పునర్విభజనతో ముడిపెట్టడం సరికాదు..


**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** మహిళా రిజర్వేషన్లను నియోజకవర్గాల పునర్విభజనతో ముడిపెట్టడాన్ని ఖండిస్తున్నామని కాంగ్రెస్ నిజామాబాద్ నగరాధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ అన్నారు. లోక్‌సభ స్థానాల సంఖ్యను పెంచే ప్రయత్నాలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. భారత జాతీయ కాంగ్రెస్ మహిళా వ్యతిరేక పార్టీ అని.. పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకుందని బీజేపీ అసత్య, దురుద్దేశపూరిత ప్రచారం సాగిస్తోందని మండిపడ్డారు. ఇది దేశ ప్రజలను తప్పుదోవ పట్టించే ఉద్దేశంతో చేస్తున్న ప్రచారమన్నారు. వాస్తవానికి, మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్ 2023లోనే ఏకగ్రీవంగా ఆమోదించిందన్నారు. మహిళా రిజర్వేషన్ల ముసుగులో, దేశ వ్యాప్తంగా పార్లమెంట్, రాష్ట్ర శాసన సభల స్థానాల సంఖ్యను పెంచడానికి, నియోజకవర్గాల పునర్విభజన చేపట్టడానికి చేసిన ప్రయత్నమే ‘రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు’ అని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా పార్లమెంట్, శాసన సభల్లో ఉన్న స్థానాల సంఖ్య ఆధారంగానే, మహిళా రిజర్వేషన్లను తక్షణమే అమలు చేయాలని కాంగ్రెస్ గట్టిగా డిమాండ్ చేస్తోందన్నారు. మహిళా రిజర్వేషన్లను నియోజకవర్గాల పునర్విభజనతో ముడిపెట్టడాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నగర కార్పొరేషన్ డీసీసీ కార్యదర్శులు ఉప్పరి స్వప్న, మడుపు స్వప్న, మాజీ యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగడం సుమన్, మాజీ కార్పొరేటర్ మురళి, జెండా గుడి ఛైర్మన్ లవంగ ప్రమోద్, హమాల్వాడి సంతోషి మాత, సాయిబాబా గుడి ఛైర్మన్ గంగాకిషన్, ఎన్ఎస్‌యూఐ నాయకులు అష్రఫ్ తదితరులు పాల్గొన్నారు.




## కామారెడ్డిలో వడగళ్ల వాన..ఆందోళనలో రైతన్న

**అక్షరటుడే, కామారెడ్డి:** పట్టణంలో ఆదివారం భారీ వర్షం కురిసింది. ఈదురు గాలులతో కూడిన వడగళ్ల వాన బీభత్సం సృష్టించింది. సాయంత్రం 3:30 గంటల నుంచి సుమారు గంటపాటు భారీగా వడగండ్లు కురిశాయి. దాంతో పట్టణంలో జన జీవనం స్తంభించింది. వడగండ్ల ధాటికి ప్రజలు బయటకు వెళ్లలేకపోయారు. రోడ్లపై ఉన్న వాహనదారులు వడగండ్ల వానతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మరోవైపు గత వారం రోజులుగా కామారెడ్డిలో సుమారు 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దాంతో ఎండ వేడిమికి తట్టుకోలేక ప్రజలు ఉక్కపోతతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వారం రోజులుగా అధిక ఉష్ణోగ్రతతో ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రజలకు ఆదివారం సాయంత్రం కురిసిన వర్షానికి వాతావరణం ఒక్కసారిగా చల్లబడటంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. మరోవైపు కామారెడ్డి పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. గ్రామాల్లో చేతికి వచ్చిన వరిపంట వడగండ్ల వర్షానికి నెలకొరుగుతుందేమోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో కొనుగోళ్లు మొదలు కావడంతో రైతులు భయపడుతున్నారు.





- సన్నబియ్యాన్ని సైతం అమ్ముకుంటున్న లబ్ధిదారులు
- వ్యాపారులకు కలిసొచ్చిన మూడు నెలల రేషన్ పంపిణీ
- డబ్బు ఆశ చూపి బియ్యాన్ని కొనుగోలు చేస్తున్న దళారులు
- చోద్యం చూస్తున్న సివిల్ సప్లయ్ అధికారులు

కామారెడ్డి జిల్లా రేషన్ బియ్యం అక్రమ దందాకు అడ్డాగా మారింది. వ్యాపారులు దర్జాగా బియ్యం దందా చేస్తున్నా పట్టించుకునేవారు లేకుండా పోయారు. జిల్లా కేంద్రం అడ్డాగా సాగుతున్న రేషన్ బియ్యం దందాపై అధికారులు నిఘా పెట్టడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గ్రామాల్లో కొందరికి డబ్బు ఆశ చూపి వారిద్వారా బియ్యం కొనుగోళ్లు చేపట్టి కోట్లకు పడగలెత్తుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

– అక్షరటుడే, కామారెడ్డి

# రేషన్ బియ్యం పక్కదారి..

సన్నబియ్యాన్ని పేదలకు కూడా అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యాన్ని పంపిణీ చేస్తోంది. పేదల ఆర్థిక అవసరాలను ఆసరాగా చేసుకుంటున్న దళారులు వారి వద్ద నుంచి దర్జాగా బహిరంగంగానే బియ్యం కొనుగోళ్లు చేపడుతున్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మూడు నెలల బియ్యం ఒకేసారి పంపిణీ చేయడం కూడా వ్యాపారులకు కలిసి వచ్చిందన్న టాక్ వినిపిస్తోంది. వ్యాపారుల డబ్బు సంపాదన, లబ్ధిదారుల అత్యాశతో రేషన్ బియ్యం పక్కదారి పడుతున్నా అధికారులు మాత్రం చర్యలు తీసుకోవడంలో విఫలం అవుతున్నారు.

### లబ్ధిదారులు అమ్మేస్తున్నారు..

గత పదేళ్లుగా రాష్ట్రంలో కొత్త రేషన్ కార్డులు మంజూరు కాలేదు. కనీసం మార్పులు, చేర్పులు కూడా చేపట్టలేదు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వంలోకి రాగానే కాంగ్రెస్ పార్టీ కొత్త రేషన్ కార్డుల పంపిణీకి శ్రీకారం చుట్టింది. కొత్తగా లబ్ధిదారుల చేర్పులు, తొలగింపులు చేపట్టింది. ఫలితంగా రేషన్ కార్డుల సంఖ్య పెరిగింది. ఎన్నికల హామీ మేరకు రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యం పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోంది. ఒక్కో లబ్ధిదారునికి 6 కిలోల చొప్పున ఎంతమంది ఉంటే అంత మందికి సన్నబియ్యం పంపిణీ చేస్తోంది. గతంలో దొడ్డు బియ్యం తినడానికి ప్రజలు ఇష్టపడక దళారులకు అమ్ముకునే వారు. ప్రస్తుతం సన్నబియ్యం వస్తుండటంతో చాలా మంది ఆ బియ్యాన్ని తింటున్నారు. ప్రతినెలా దుకాణాల్లో కొనుగోలు చేసిన బియ్యాన్ని మాత్రమే తినే లబ్ధిదారులు రేషన్ దుకాణాల ద్వారా వచ్చే సన్నబియ్యాన్ని మార్కెట్లో వ్యాపారులకు విక్రయిస్తు న్నారు. కొందరు లబ్ధిదారులు ప్రభుత్వం సర ఫరా చేస్తున్న సన్నబియ్యం కూడా తినడానికి ఇష్టపడక ముక్కోవడంతో వ్యాపారులకు సన్నబియ్యం దందా మూడు పువ్వులు, ఆరు కాయలుగా సాగుతోంది.

### కలిసి వచ్చిన మూడు నెలల రేషన్

జిల్లాలో 2,95,578 రేషన్ కార్డులు ఉన్నాయి. కార్డుల్లో 10,10,063 మంది లబ్ధిదారులు ఉన్నారు. వీటి ద్వారా ప్రతి నెల దాదాపు 6 వేల మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యం గోదాముల ద్వారా రేషన్ దుకాణాలకు సరఫరా అవుతోంది. ఈ దఫా వేసవి తాపం తీవ్రంగా ఉండే అవకాశం ఉండడంతో లబ్ధిదారులకు ఇబ్బంది కలగకుండా ఉండేలా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మూడు నెలల కోటా రేషన్ బియ్యం ఒకేసారి పంపిణీ చేయాలని నిర్ణయించాయి. దాంతో జిల్లాలో మూడు నెలల కోటా 18,147 మెట్రిక్ టన్నుల బియ్యం సరఫరా కావాల్సి ఉండగా ఇప్పటికి 16,177 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యం గోదాముల ద్వారా రేషన్ దుకాణాలకు చేరింది. ప్రస్తుతం పంపిణీ ఇంకా కొనసాగుతోంది. అయితే చోట మోటా వ్యాపారులకు మాత్రం మూడు నెలల రేషన్ కోటా ఒకేసారి పంపిణీ చేయడం కలిసి వచ్చింది.

### చోద్యం చూస్తున్న అధికారులు

జిల్లాలో రేషన్ బియ్యం దందా బహిరంగంగా కొనసాగుతున్నా సివిల్ సప్లయ్ అధికారులు చోద్యం చూస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రేషన్ షాపుల ద్వారా బియ్యం నిజంగా లబ్ధిదారులకు చేరుతుందా.. లేదా.. అనే విషయమై నిఘా పెట్టడం లేదని తెలుస్తోంది. కొందరు రేషన్ డీలర్లు సైతం లబ్ధిదారుల వద్ద వేలిముద్రలు తీసుకుని డీలర్లు లబ్ధిదారులకు అక్కడే డబ్బులిచ్చి వ్యాపారం చేస్తున్నారన్న విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. వీటిని కట్టడి చేయడంలో అధికారులు పూర్తిగా విఫలం అవుతున్నారని, ఫలితంగా రేషన్ బియ్యం ద్వారా కొనుగోలు చేసిన బియ్యం తిరిగి అదే రేషన్ షాపుకు సరఫరా అవుతున్నట్టుగా తెలుస్తోంది. నిఘా పెట్టాల్సిన అధికారులు తూతూమంత్రంగా తనిఖీలు చేపట్టి, దాడులు చేసి చేతులు దులుపుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా సరఫరా అవుతున్న రేషన్ బియ్యం అక్రమ దందాపై అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

### డబ్బు ఆశ చూపి..

రేషన్ బియ్యం దందా చేసే వ్యాపారులు లబ్ధిదారులకు ఆకర్షణీయ ధరలతో ఆకట్టుకుంటున్నారు. కిలో బియ్యానికి దాదాపు రూ.20 ఇచ్చి బియ్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. దాంతో బియ్యం అమ్ముకోవడానికి లబ్ధిదారులు సుముఖత వ్యక్తం చేస్తున్నారు. లబ్ధిదారుల నుంచి చోటా వ్యాపారులు సేకరించిన బియ్యాన్ని దాదాపు రూ. 25 చొప్పున ప్రధాన వ్యాపారులకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. దందాను కొనసాగించే ప్రధాన వ్యాపారులు సేకరించిన బియ్యాన్ని తిరిగి రైస్ మిల్లర్లకు విక్రయిస్తున్నట్టుగా సమాచారం. అవే బియ్యాన్ని తిరిగి గోదాములకు సరఫరా చేసి రీసైక్లింగ్ చేస్తున్నట్టుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి.

## పోచంపాడ్‌లో చలివేంద్రం ప్రారంభం



**అక్షరటుడే, మెండోరా:** వేసవి కాలంలో ప్రజల దాహాన్ని తీర్చేందుకు పోచంపాడ్ గ్రామంలో చలివేంద్రాన్ని సర్పంచ్ మాధురి ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు శుద్ధమైన తాగునీరు అందించేందుకు ఈ చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలి పారు. వేసవిలో ప్రయాణికులు, గ్రామస్థులు చలివేంద్రంతో ఉపశమనం పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సంపంగి సతీష్, సెక్రె టరీ భోజన్న, వార్డ్ సభ్యుడు కరీం నజీర్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



**అక్షరటుడే, ఆర్మూర్:** ఆలూర్ మండలం రాంచంద్రపల్లికి చెందిన అనారోగ్యంతో బాధపడుతున్న రెండు కుటుంబాలకు సీఎం సహాయనిధి నుంచి ఆర్థిక సహాయం అందించారు. గ్రామానికి చెందిన రుచిత ఇటీవల తీవ్ర అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందారు. వారి పరిస్థితిని ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి పొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లిన తర్వాత, ఆయన చొరవతో సీఎంఆర్‌ఎఫ్ నిధులు మంజూరయ్యాయి. ఈ మేరకు భూపతికి రూ.7000, రుచితకు రూ.17,500 చెక్కులను వారి కుటుంబ సభ్యులకు సర్పంచ్ తొగరి భూషన్, పార్టీ అధ్యక్షుడు సక్కి ప్రభాకర్ అందజేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ గంగాధర్, నాయకులు సక్కి ప్రభాకర్, గంగారాం, శశి కుమార్ పాల్గొన్నారు.



## నాగంపేట్‌లో ఉచిత కంటి వైద్య శిబిరం

**అక్షరటుడే, ముప్కాల్:** ముప్కాల్ మండలం నాగంపేట్ పంచాయతీ కార్యాలయంలో డాక్టర్ నవీన్ సూపర్ స్పెషాలిటీ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో డాక్టర్ విజయ్ రోగులకు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను పంపిణీ చేశారు. క్యాటరాక్ట్ సమస్య ఉన్న వారికి రక్త పరీక్షలు చేసి, శస్త్రచికిత్సలను ఆస్పత్రిలో ఉచితంగా నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని గ్రామప్రజలు సద్వినియోగం చేసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ దాసరి గంగాధర్, ఉప సర్పంచ్ మదన్, వార్డు సభ్యులు సురేష్, నారాయణ, రవి, సాయిగణేష్, ఆస్పత్రి సిబ్బంది మునీష్, శారద, యువనేస్తం సంస్థ సభ్యులు వినయ్, ప్రశాంత్, నవీన్, గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి

**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** నగరంలోని జీజీహెచ్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈ మేరకు వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి వివరాలు వెల్లడించారు. ఈనెల 15న ప్రభుత్వ ఆస్పత్రిలోని రేకుల షెడ్‌లో ఓ వ్యక్తి పడిపోయి ఉన్నాడని అక్కడివారు వైద్యులకు సమాచారం అందించారు. దీంతో స్పందించిన వైద్యులు ఆస్పత్రిలోకి తీసుకెళ్లి అతడికి చికిత్స అందించారు. అతడి వద్ద ఎలాంటి ఆధారాలు లేకపోయినప్పటికీ అతడికి చికిత్స చేశారు. ఈ క్రమంలో ఆదివారం అతడు మృతి చెందాడు. అతడి వయస్సు 42 ఏళ్లు ఉంటుందని.. బూడిద రంగు టీషర్ట్, నీలి రంగు ప్యాంట్ వేసుకుని ఉన్నాడని పోలీసులు తెలిపారు. ప్రస్తుతం మృతదేహాన్ని మార్చురీలో భద్రపర్చామని.. వివరాలకు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్‌హెచ్‌వో తెలిపారు.

## మహిళా సమాఖ్య భవనానికి శంకుస్థాపన



**అక్షరటుడే, ఆర్మూర్:** ఆలూర్ మండలం గుత్ప తండాలో మహిళా సమాఖ్య భవన నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన నిర్వహించారు. సర్పంచ్ కొర్ర కిషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ కొర్ర కిషన్ మాట్లాడుతూ.. మహిళా సమాఖ్య భవనం నిర్మాణానికి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధుల ద్వారా రూ.10 లక్షలు మంజూరయ్యాయన్నారు. ఈ భవనం మహిళల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి కేంద్రంగా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. మహిళా సంఘాల సభ్యులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని స్వయం ఉపాధి అవకాశాలను పెంపొందించుకోవాలన్నారు. ఆదాయ వృద్ధి సాధించి కుటుంబాలను అభివృద్ధి పథంలో నడిపించాలని సూచించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ గుగ్లోత్ మహేష్, తండా పెద్దలు దశరథ్ నాయక్, గంగారాం నాయక్, మహిళా సంఘాల సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఆర్మూర్ పోలీస్ స్టేషన్ ఆవరణలో స్వచ్ఛభారత్

**అక్షరటుడే, ఆర్మూర్:** పట్టణంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం మహాత్మ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆర్మూర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ మాట్లాడుతూ.. పోలీస్ స్టేషన్ ఆవరణను పరిశుభ్రంగా తీర్చిదిద్దామన్నారు. ఇందుకు సహకరించిన ఆర్మూర్ మహాత్మ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు సుంకే శ్రీనివాస్, సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందామన్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు ప్రశాంత్, భోజన్న, జహేర్, నరేందర్, సుమన్, రాహుల్ రాజ్, సాయి చరణ్, మహేష్, నూకల ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.




## టిప్పర్ ఇంజిన్‌లో మంటలు.. డ్రైవర్‌కు తప్పిన ప్రమాదం

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** రోడ్డుపై వెళ్తున్న ఓ టిప్పర్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. పొగలు, మంటలు రావడంతో అప్రమత్తమైన డ్రైవర్ వెంటనే టిప్పర్‌ను అక్కడే నిలిపి కిందికి దిగిపోవడంతో ప్రాణాపాయం తప్పింది. ఈ ఘటన నాగిరెడ్డి పేట మండలం బంజారా తండా సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్సై భార్గవ్ గౌడ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నాగిరెడ్డిపేట మండలం బంజారా తండా సమీపంలో మట్టిలోడ్‌తో వెళ్తున్న టిప్పర్‌లో మంటలు అంటుకున్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అనంతరం ఫైర్‌స్టేషన్ సిబ్బందికి సమాచారం ఇవ్వగా వారు వచ్చి మంటలను ఆర్పివేశారు. వైరింగ్ డిఫాల్ట్ వల్లే మంటలు చెలరేగి ఉండొచ్చని డ్రైవర్, ఫైర్ అధికారులు పేర్కొన్నారు. వాతావరణంలో మార్పుల కారణంగా ఎండలు తీవ్రం కావడంతో వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని, వాహనాలను జాగ్రత్తగా నడపాలని, ఇంజిన్ వేడెక్కకుండా తరచుగా తనిఖీ చేయించుకోవాలని ఎస్సై సూచించారు.



## మీరే ఓ ఎన్యుమరేటర్'.. స్వీయ జనగణనకు ప్రభుత్వం శ్రీకారం..

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** జనగణనలో భాగంగా వివరాలను సొంతగా నమోదు చేసుకునే అవకాశం కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. నగరాల్లో ప్రారంభమైన స్వీయ జనగణన ప్రక్రియపై అధికారులు విస్తృతంగా ప్రచారం చేయాలని, ప్రతి ఇంటికీ అవగాహన కల్పించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. జనగణన ప్రక్రియ ఆరంభమైంది. ప్రజలే స్వచ్ఛందంగా పోర్టల్‌లో స్వీయ గణన చేసుకునే వెసులుబాటును ప్రభుత్వాలు కల్పించాయి. గతంలో ఎన్యుమరేటర్లు ఇంటింటికీ వచ్చి వివరాలు సేకరించేవారు. ఇప్పుడు మీ స్మార్ట్ ఫోన్ లేదా కంప్యూటర్, ల్యాప్‌టాప్ ద్వారా స్వయంగా ఎవరికి వారే వివరాలు నమోదు చేసుకునే ఏర్పాట్లు చేశారు. ప్రభుత్వం నిర్వహించే జనాభా గణన లేదా ఇతర సర్వేల్లో ప్రజలు ఎన్యుమరేటర్లుగా కీలక పాత్ర పోషించేవారు. కానీ, జనగణనలో ఎన్యుమరేటర్ల సాయం లేకుండానే అధికారిక పోర్టల్ ద్వారా తమ కుటుంబ సభ్యులు, ఇతర వివరాలు నమోదు చేసుకునేందుకు సెల్ఫ్ ఎన్యుమరేషన్ తీసుకొచ్చారు. దీంతో సమాచార గోప్యతతోపాటు సమయాన్ని కూడా ఆదా చేసుకోవచ్చు. ముందుగా అనే అధికారిక పోర్టల్‌ను సందర్శించాలి. అక్కడ లాగిన్ ప్రక్రియలో రాష్ట్రం, క్యాప్చా నమోదు చేసి వెరిఫై చేయాలి. అనంతరం యూజర్ నేమ్, ఫోన్ నంబర్, ఈమెయిల్ ఐడీ నమోదు చేస్తే ఫోన్‌కు ఆరు అంకెల ఓటీపీ వస్తుంది. దీనిని నమోదు చేసిన అనంతరం ప్రక్రియ ప్రారంభమవుతుంది. శాటిలైట్ మ్యాప్ కనిపిస్తూనే చిరునామా, పిన్‌కోడ్ నమోదు చేయమని అడుగుతుంది. మీరిచ్చే సమాచారం ఆధారంగా ఆక్యుపెన్సీ, రేఖాంశాల వివరాలు తీసుకుని మీ ఇంటిని మ్యాప్‌లో నమోదు చేస్తుంది. మీ ఇల్లు మట్టితో కట్టిందా..? సిమెంట్ ఇటుకలతోనా..? గోడల పరిస్థితి ఏంటి..? ఇల్లు ప్రస్తుతం ఏ స్థితిలో ఉంది? తాగునీటి సౌకర్యం, టాయిలెట్ ఫెసిలిటీ, వంటకు వాడే ఇంధనం ఇలా సుమారు 30 ప్రశ్నలకు సమాధానాలు నమోదు చేయాలి. కుటుంబ సభ్యుల పేర్లు, వయస్సు, లింగం, విద్యార్హతలు, వృత్తి, వైవాహిక స్థితి ఇలా అన్నీ నమోదు చేశాక సేవ్ చేసుకుంటూ వెళ్లాలి. చివరకు ప్రివ్యూ చూసుకొని సబ్మిట్ చేయాలి. సబ్మిట్ చేశాక ఓ రిఫరెన్స్ నంబర్ వస్తుంది. దాన్ని మనం భద్రంగా దాచుకోవాలి. తర్వాత ఎన్యుమరేటర్ మన ఇంటికి వచ్చినప్పుడు ఆ నంబర్ ఇస్తే చాలు. మళ్లీ మన వివరాలను వారికి చెప్పాల్సిన అవసరం ఉండదు. ఈనెల 16 నుంచి 30 వరకు మాత్రమే స్వీయ లెక్కింపునకు అవకాశం ఉంది. 30 తర్వాత ఎన్యుమరేటర్లే ఇంటికి వస్తారు. పోర్టల్‌లో తెలుగు సహా అన్ని ప్రాంతీయ భాషల్లో వివరాలు నమోదు చేసుకునే సౌకర్యం ఉంది.

